# జ్ఞాతి

హోటలు రిసెప్షనిస్టు రిజిస్టరు నా ముందుంచి, "ఇక్కడ మీ పేరు, చిరునామా మిగతా వివరాలన్ని రాసి సంతకం పెట్టి వంద రూపాయలు అడ్వాన్సు ఇవ్వండి" అన్నాడు. అన్ని పూర్తి చేసి అడ్వాన్సు ఇవ్వగానే రసీదు ఇచ్చి బోర్డులోంచి తాళంతీసి బల్లమీదున్న గంటనొక్కాడు. తొమ్మిదీ నలభయి అయింది. బడలికగా ఉంది. ఆకలి వేస్తోంది. ఎప్పటి నుండో హైదరాబాద్ వద్దామనుకుంటే ఇప్పటికి గాని వీలు కలగలేదు. రాత్రి గోదావరిలో బెర్త్ దొరికింది కాని ఎందుచేతనో నిద్రపట్టలేదు. నాలుగింటివరకు మెలకువగానే ఉన్నాను. నిద్రలేమికి కళ్లు మంటలుగా ఉన్నాయి.

రిసెప్షనిస్టు గంట మరోసారి నొక్కబోయేంతలో తెల్లటి బట్టలు వేసుకున్న కుర్రాడు లోపల్నుండి పరుగెత్తుకుంటూ వచ్చి బల్లకానుకుని నిలబడి నావంక ఏగాదిగా చూశాడు.

"వీరిని ఇరవయి ఆరో నెంబరు గదికి తీసుకువెళ్లు" అని తాళం చెవి అతనికి అందించాడు. కుర్రాడు నా సూటుకేస్ అందుకుని "రండి సార్" అని కదిలాడు. అతన్ని అనుసరించాను.

ఇరవై ఆరో నెంబరు గది రెండవ అంతస్థులో చివర ఉంది. సూటుకేసు కిందపెట్టి తాళం తీస్తుంటే పిట్టగోడకు ఆనుకుని నిలబడ్డాను. దూరంగా సికింద్రాబాద్ స్టేషన్ కనిపిస్తోంది. అతను తాళం తీసి గదిలోకి నడిచి సూటుకేస్ బల్లమీద పెట్టాడు. సింగిల్ రూం చిన్నగా ఉంది. అంత చిన్నగదికి ఇరవై అయిదు రూపాయల అద్దె ఎక్కువే. కుర్చీకూడా లేదు. మంచంమీద కూర్చున్నాను. అతను కిటికి తలుపు తీస్తోంటే "నీ పేరేమిటి?" అడిగాను.

"రాములు."

చెప్పులు మంచంకిందకు నెట్టి రాముల్ని పరీక్షగా చూశాను. అతనికి ఇరవై అయిదు సంవత్సరాలుంటాయేమో సన్నగా, నల్లగా, పొడుగ్గా ఉన్నాడు. అతను వేసుకున్న యూనిఫాం పొట్టిగా ఉంది.

"స్నానం చేయటానికి నాకు రెండు బక్కెట్లు వేడి నీళ్లు తెచ్చిపెట్టగలవా?" అడిగాను.

"రెండు బక్కెట్లు దొరకవు. ఒక బక్కెట్ దొరుకుతుంది."

"సరే" అని జేబులోంచి రెండు రూపాయల కాగితం తీసి అందించాను. ఎంత త్వరగా అందుకున్నాడో అంత త్వరగా చొక్కా జేబులో పెట్టుకుని బయటకు నడుస్తూ తలుపు దగ్గరగా వేశాడు. లేచి సూటుకేస్ ఎదురుగా నిలబడి జేబులోంచి తాళంచెవి తీసి తెరిచి లుంగీ, తువ్వాలు బయటకు తీసి మడిచి ఉన్న పేంటు మధ్య వరుసగా పెట్టి ఉన్న డబ్బులు తడిమి చూశాను. అయిదు కట్టలు. మా అమ్మాయి పెళ్లికి నగలు కొనటానికి నేనింత దూరం రానవసరం లేదు. మంచివి విశాఖపట్టణంలో దొరకకపోవు. మా పక్కింటి రంగనాయకుల కూతురు పెళ్లికి నగలు హైదరాబాద్ నుండి తెప్పించుకున్నారు. కాబట్టి మా అమ్మాయి పెళ్లికి నగలు హైదరాబాద్ నుండి రావలసిందే అన్నది మా ఆవిడ కోరిక. ఆవిడ మాట ఎప్పుడూ కాదనను. నాది సర్దుకుపోయే మనస్తత్వం. అదీకాకుండా నాకు ఎప్పటినుండో హైదరాబాద్ చూడాలని ఉంది. ఆ కోరిక ఈ విధంగానైనా తీర్చుకోవచ్చు అని ఇంతదూరం వచ్చాను. స్నానం చేసి భోజనం చేశాక సింహాచలానికి ఫోను చేయాలి. సింహాచలం మా శ్రీకాకుళం మనిషి. ఇరవై సంవత్సరాలకిందటే ఇక్కడకు వచ్చి స్థిరపడిపోయాడు. సనత్‌నగర్‌లో ఇల్లు కూడా కట్టుకున్నాడు. సూటుకేస్ అడుగునుంచి చిరునామాలున్న పుస్తకం తీశాను. సింహాచలం పనిచేస్తున్న ఫ్యాక్టరీ చిరునామా, టెలిఫోన్ నంబరు దొరికాయి.

నా వెనక ఎవ్వరో కదిలిన అలికిడి అయ్యేసరికి చటుక్కున వెనక్కి తిరిగి చూశాను. రాములు. తలుపు తెరుచుకుని లోపలికి ఎప్పుడు వచ్చాడో తెలియదు. సూటుకేసులో డబ్బు చూశాడో ఏమో! సూటుకేస్ మూతవేశాను. అతను చడీచప్పుడు కాకుండా గదిలోకి రావటం నాకు నచ్చలేదు. అతను తలవంచుకొని బక్కెట్టు స్నానాల గదిలో పెట్టి వెళ్లిపోయాడు. గది తలుపు దగ్గరగా వెయ్యబోతూ ఆగి తలబయటకిపెట్టి నడవలోకి చూశాను. రాములు పైమెట్టుమీద ఉన్నవాడల్లా నన్ను చూడగానే హడావిడిగా కిందికి దిగిపోయాడు. వాడి వాలకం నాకు అనుమానాన్ని కలిగిస్తోంది. తలుపు మూసి పై గడి పెట్టాను. స్నానం చేస్తున్నానే గాని మనసంతా డబ్బుమీదే ఉంది. ఇంత డబ్బుతో భద్రతలేని హోటలులో ఉండటం మంచిదికాదనిపిస్తోంది. కొన్ని హోటళ్లలో లాకర్లుంటాయి. అందులో డబ్బు,గట్రా దాచుకోవచ్చు. ఈ హోటలులో లాకరు ఉన్నట్టు లేదు. బయటినుండి వచ్చిన వాళ్ల దగ్గిర కొద్దోగొప్పో డబ్బుందని తెలిస్తే ఏ ముప్పుముంచుకొస్తుందో తెలియదు. సింహాచలం ఒప్పుకొంటే ఈ హోటలు గది ఖాళీచేసి నేనిక్కడ ఉన్నన్నాళ్ళూ అతనింట్లోనే ఉండొచ్చు. పది నిమిషాల్లో స్నానం ముగించి సూటుకేసులోంచి కొత్తగుడ్డలు తీసుకుంటూ ఎందుకో అనుమానం వేసి తలుపు గడివంక చూశాను. గడి తీసిఉంది. గది తలుపు

వెంటిలేటరులోంచి గడి తీయవచ్చు. ప్రస్తుతం జరిగిందదే. ఆ పని రాములు చేసి ఉంటాడు. సందేహం లేదు. పేంటు మడతలోని డబ్బు అలానే ఉంది. స్నానం చేస్తుండగా రాములు గదిలోకి వచ్చే ప్రయత్నం చేసే లోపల నేను స్నానం ముగించటంతో వీలయి ఉండదు. తలుపు దగ్గరకు వచ్చి చటుక్కున తెరిచాను. నడవలో ఎవ్వరూ లేరు. తలుపువేసి గడి పెట్టాను.

అంత డబ్బును మా ఆవిడ ప్రత్యేకంగా కుట్టి ఇచ్చిన గుడ్డ సంచిలో అక్కడో కొంత ఇక్కడో కొంత సర్ది నడుంకు చుట్టుకుని దానిమీద చేతుల బనియను తొడుకున్నాను. పేంటు తొడుక్కుని బెల్టు బిగించాను. బయటకేమీ కనబడటంలేదు. చొక్కా తొడుక్కుని తలుపువేసి తాళం బిగించి రిసెప్షనిస్టు దగ్గరకు వచ్చి కౌంటరుమీద తాళం పెట్టి, "ఫోన్ చేసుకుంటాను" అన్నాను.

ఫోన్‌కు వేసిన తాళం తీసి "చేసుకోండి" ఫోన్ నా ముందుకు నెట్టాడు.

సింహాచలం పనిచేస్తున్న ఫ్యాక్టరీకి ఫోను చేసి "నాకు సింహాచలం కావాలండీ" అన్నాను.

అవతలివైపునుండి సన్నటి నవ్వుతో, "మా ఫ్యాక్టరీలో ఏడెనిమిది మంది ఆపేరు గల వాళ్లున్నారు. అందులో ముగ్గురు సి.సింహాచలాలు ఉన్నారు. మీకు కావలసినతను ఏ ఊరివాడో, ఏ సెక్షనులో పనిచేస్తుంటాడో చెప్పగలిగితే మీకు సహాయం చేయగలను." అంది ఆపరేటరు.

"ఎలక్ట్రికల్ మెయిన్‌టెన్స్‌లో చార్జ్‌మెన్‌గా పనిచేస్తున్నాడండీ. అతనిది శ్రీకాకుళం."

"మీరు లైన్లో ఉండండి. ఆ సెక్షనుకు కనక్షనిస్తాను."

పావు నిమషం తరువాత "ఎలక్ట్రికల్ మెయిన్‌టెన్స్" అని వినిపించేసరికి నాకు ఎవరు కావాలో చెప్పాను. "ఆయన లేరండి నాలుగు రోజుల కిందట తీర్థయాత్రా స్పెషల్‌లో కుటుంబంతో సహా యాత్రలకు వెళ్లాడు. పది రోజుల వరకు రాడు" అని ఫోను పెట్టేశాడు. ఎక్కడలేని నిరుత్సాహం వచ్చింది. రిసీవరు హుక్ మీద పెట్టి ఫోనుకయిన డబ్బులిచ్చి బయటకు వచ్చాను. స్టేషన్ వరకు నడుచుకుంటూ వచ్చి స్టేషన్ ఎదురుగా ఉన్న హోటలులో భోజనం చేస్తూ తర్వాత కార్యక్రమం ఏమిటా అని ఆలోచించసాగాను. ఏబిడ్స్‌లో బంగారపు నగల దుకాణాలుంటాయని వాటిల్లో చాలా వెరైటీలుంటాయని రంగనాయకులు నాతో అన్నాడు. ముందు అక్కడకు వెళ్లి నగలు తీసుకుంటే ఒక పని అయిపోతుంది. నగలతో హోటలులో ఉండటం శ్రేయస్కరం కాదు. సాయంత్రం గోదావరి ఎక్కితే మరుసటి రోజుకల్లా మా ఊళ్లో ఉంటాను.

సిటిబస్సులో ఏబిడ్స్ చేరుకునే సరికి పదకొండయింది. మా అమ్మాయికి ఎటువంటి నగలు కావాలో, ఎంతలో ఉండాలో మా ఆవిడ ఇచ్చిన సూచనలు మననం చేసుకుంటూ మొదటిగా కనిపించిన బంగారపు దుకాణం దగ్గిరకు వచ్చాను. పెళ్ళిళ్ల సీజను అవటాన దుకాణంలో చాలా మంది ఉన్నారు. ఎక్కువ మంది ఉన్న చోటుకు వెళ్లటానికి జంకుతుంటాను. పది గజాల ముందుకు నడిచాక మరొక దుకాణం కనిపించింది. అందులోకి వెళ్దామనుకుంటూ ఆగిపోయాను. ఆ దుకాణంలో ఒకరిద్దరున్నారు. హఠాత్తుగా నా చూపులు ఆ దుకాణానికి పక్కనే ఉన్న సినిమా హాలు మీదకు జరిగాయి. ఆ హాలు కొత్తగా కట్టినట్టున్నారు. ఆహాలుకన్నా ఆ హాలు ముందున్న పోస్టరు నన్ను బాగా ఆకర్షించింది. అది బ్రూస్‌లీ సినిమా. అతని సినిమాలు మా వూరు రావు. విశాఖపట్టణంలో మిస్ అయ్యాను. ఈసారి తప్పకుండా చూడాలనిపించింది. ఈ అవకాశం వదులుకుంటే అతని సినిమాలు చూడలేను. ఇప్పుడు నా వయసు అరవయి రెండు సంవత్సరాలు. నాకు ఫయిటింగ్ సినిమాలంటే చాలా ఇష్టమని మా ఇంట్లో ఎవరికీ తెలియదు. నా ఇష్టాలు బయటకు చెప్పకోడానికి బిడియపడుతుంటాను.

టికెట్టు కొనుక్కుని హాలులో కూర్చున్నాను. హాలు చల్లగా ఉంది. జనం అట్టే లేరు. సినిమా మొదలయిన అరగంట తర్వాత ఒకతను వచ్చి నాపక్కన ఉన్నసీట్లో కూర్చున్నాడు. పది నిమిషాలు గడిచాక నా పక్కన కూర్చున్న మనిషి సినిమా చూడకుండా నా ముఖంలోకి తేరిపార చూస్తున్నట్లనిపించి అతని వంక చూశాను.

"నీదేవూరు?" అడిగాడు.

అతని ప్రశ్నకు జవాబు చెప్పాలనిపించలేదు. దృష్టితెరపైకి సారించాను.

"బేవకూఫ్! నేనడిగింది నిన్నేరా. ఏ ఊర్రానీది?" కరుకుగా అని నా జవాబుకోసం ఎదురుచూడకుండా తన ఎడమచేయి నాకుడిచేయిమీద వేసి గట్టిగా పట్టుకున్నాడు. అతని చేయి బలంగా ఉంది. నా వెన్నులోంచి వణుకు ప్రారంభమయింది. నా చేతిని విడిపించుకున్నాను. ముందు వరుస సీట్లు ఖాళీగా వున్నాయి. నా ఎడమ పక్క చివర్లో ఎవరో కూర్చుని ఉన్నారు. వెనక వరసలో కూడా ఎవరూ ఉన్నట్టు లేరు. గుండె వేగంగా కొట్టుకోవడం మొదలెట్టింది.

"ఈ ఊరే. ఏం?" తెచ్చిపెట్టుకున్న ధైర్యంతో అన్నాను.

"నీదీఊరుకాదు. శ్రీకాకుళం".

"తెలిసి ఎందుకు అడిగావు?" నా గొంతులో తడారిపోతోంది.

"ఇక్కడ కూర్చుంది నువ్వో, కాదో తెలుసుకోటానికి అడిగాను..... డబ్బు.... ఎంత తెచ్చావు?"

"ఏం డబ్బు?" గొంతు పెంచాను.

"మెల్లగా మాట్లాడు. ఈ ఊరికి కొత్తవాడివి. నా గురించి బొత్తిగా తెలియదులా ఉంది. పిచ్చిపిచ్చి వేశాలు వేయటానికి ప్రయత్నిస్తే నేను జేబులోంచి కత్తి తీయాల్సి వస్తుంది......ఎంత తెచ్చావు?" అతను తాగి ఉన్నట్టున్నాడు. మాట్లాడుతుంటే సారా వాసన వేస్తోంది.

నాకు చెమట పట్టటం మొదలు పెట్టింది. నా గుండె కొట్టుకునే చప్పుడు నాకే స్పష్టంగా వినిపిస్తోంది. అసలు వీడెవడు? నాదగ్గర డబ్బు ఉన్నట్టు వీడికెలా తెలిసింది? రాములు కాని వీడికి చెప్పిఉంటాడా? వీడితోపాటు వాడూ వచ్చి ఉంటాడు. వాడు బయట ఉండి వీడిని లోపలకు పంపించి ఉంటాడు.

"నిన్నేరా...." అని నా భుజం పట్టుకుని గట్టిగా నొక్కాడు.

"అయిదువేలు తెచ్చాను" నింపాదిగా అన్నాను.

"ఇంకా ఎక్కువే తెచ్చావు. నాతో అబద్దాలు ఆడితే తర్వాత బాధపడతావు."

"ముందు నా భుజం వదులు, నొప్పిగా ఉంది".

పట్టు సడలించి, "ఎంత తెచ్చావు?" అడిగాడు.

"నేను తెచ్చింది అయిదువేలే, నేను అబద్ధం ఆడటంలేదు...." అంటుంటే నా మాటలకు అడ్డువచ్చి, "ఎంతో కొంతలే. అవి తీసి ఇలా ఇవ్వు......" అన్నాడు.

ధైర్యాన్ని కూడగట్టుకుని, "అవి ఇక్కడెక్కడ ఉన్నాయి? హోటలు గదిలో ఉన్నాయి." అన్నాను.

"నీ గది వెదికాము.అక్కడలేవు."

" అక్కడే ఉన్నాయి. అనుమాన అయితే నా జేబులు వెతుక్కో."

నా పేంటు జేబులు వెదికాక వాడికి నా మాటమీద నమ్మకం కలిగినట్లుగా ఉంది."హోటలు గదిలో ఎక్కడ దాచావు?" అడిగాడు.

"స్నానాల గదిలో...... అద్దం వెనకాల, కాగితంలో చుట్టిపెట్టాను."

వాడు చటుక్కున లేచి నిలబడి, "నీ మాటలు అబద్ధం అయినయో నువ్వు తిరిగి మీ ఊరు చేరవు. నీ శవం హుస్సేన్ సాగర్‌లో తేలుతుంది........" అని బయటికి వెళ్లిపోయాడు.

ఈ మాటలకు నాకు వణుకు ఎక్కువయింది. స్వతహాగా నేను పిరికి మనిషిని. వాడితో డబ్బు విషయంలో అంత అబద్ధం ఎలా ఆడగలిగానో ఆలోచిస్తుంటే నాకే ఆశ్చర్యం వేస్తోంది. అయిదు నిమిషాలు ఆగి లేచి తలుపు దగ్గిరకు వచ్చి తలుపు కొద్దిగా తెరిచి

చూశాను. బయట ఎవ్వరూ కనిపించలేదు. బయటకు వచ్చి వడివడిగా టాయిలెట్స్‌లోకి నడిచి సిగరెట్ వెలిగించాను. నా చేతులు వణుకుతున్నాయి. ఏమి చేయాలో బోధపడటంలేదు. జీవితంలో ఇంత విషమ పరిస్థితి ఎదురవ్వటం అదే మొదటిసారి. వాళ్లకంటబడితే నడిరోడ్డులో నన్ను తన్ని డబ్బులు లాక్కుంటున్నా ఎవరూ కలిగించుకోరు. అడ్డంరారు. ఆదుకోరు. కేసు, పోలీసులు తర్వాతి మాట. ప్రస్తుతం వీళ్లబారి నుండి తప్పించుకోవాలి. ఎలా? హాలు బయటకు వస్తే ఇందాకటి రౌడి, రాములు ఉంటే ఏమి చేయటం?

ఏదిఏమైతే అయ్యిందని బయటకు రాబోతూ ఆగిపోయాను. నేను హాలునుంచి బయటకు వచ్చిన తలుపు దగ్గర రాములు నిలబడి ఉన్నాడు. వాడి పక్కనే హాలులో నన్ను బెదిరించినవాడున్నాడు. హాల్లో చీకట్లో వాడిని సరిగా గమనించలేదుకాని ఇప్పుడువాడిని చూస్తుంటే ఎక్కడో చూసినట్లు అనిపించింది. వాడికి రాములు వయసు ఉంటుంది. నల్లగా, పొడుగ్గా, బలంగా ఉన్నాడు. నల్లటి పేంటు మీద ఎర్రటి టీ షర్టు వేసుకున్నాడు. వాడి ముఖంమీద స్ఫోటకం మచ్చలు చూశాక వాడిని ఎక్కడ చూశానో గుర్తు వచ్చింది. సికింద్రాబాదు స్టేషన్లో నేను సిటీ బస్సు ఎక్కుతున్నప్పుడు నాతోపాటే ఎక్కాడు. నా ముందు సీట్లో కూర్చున్నాడు. రాములు కూడా అదే బస్సులో ఎక్కిఉండాలి.

వాళ్లిద్దరూ ఏదో మాట్లాడుకుని హాలులోకి వెళ్లారు. సిగరెట్ కిందపడేసి హాలు బయటకి వచ్చి ఆటో రిక్షాలో కూర్చుని, “సికింద్రాబాద్ స్టేషన్‌కు పోనీయ్” అన్నాను. ఇరవై నిమిషాల తర్వాత రిక్షా నేను దిగిన హోటలు ముందాగింది. డబ్బులు ఇచ్చి హోటల్లోకి వచ్చానో లేదో రిసెప్షనిస్టు గది తాళం తీసి నాకు అందిస్తూ, “మీకోసం ఎవరో ఫోను చేశారు. పేరడిగితే చెప్పలేదు. మెసేజ్ ఏమైనా ఇమ్మంటారా అని అడుగుతుంటే ఫోను పెట్టేశారు” అన్నాడు.

“ఫోను చేసి ఎంతసేపవుతుంది?”

“అయిదు నిమిషాలవుతుంది.”

బల్లమీద మోచేతులుంచి ముందుకు వంగి, “ఫోను చేసింది ఎవరోకాదు, మీ దగ్గర పనిచేసే రాములు” అన్నాను.

అతను నా ముఖంలోకి పరీక్షగా చూసి, “మా రాములా?” అడిగాడు.

“అవును. నేను హోటలుకు చేరుకున్నానో లేదో తెలుసుకోవటానికి ఫోను చేసి ఉంటాడు.......” అని చుట్టూ ఒకసారి చూసి ఎవరూ లేకపోయేసరికి జరిగినదంతా చెప్పాను. విని, అతను దీర్ఘంగా నిట్టూర్చి, “మీరు తక్షణం గది ఖాళీచేసి వెళ్లిపోండి.” నా ముందుకు వంగి, “అతను మంచివాడుకాదు. డబ్బులకోసం ఏమైనా చేయగలడు. వాడికో

చిన్న ముఠా ఉంది. వాళ్ల ఆగడాల్లో కొంతమంది పోలీసుల చేతులున్నాయి. మీరు రిపోర్టు ఇచ్చినా లాభం ఉండదు. వాడిని నాలుగైదుసార్లు ఉద్యోగం నుంచి తీసేసినా ఎలాగో మళ్లీ ఉద్యోగంలో చేరాడు. నేను ఇక్కడ నెలకు నూటయాభై రూపాయలకు పనిచేసే వ్యక్తిని. ఇక్కడే ఉండేవాడిని. మీ మీద జాలి చూపటం తప్ప మరే విధమైన సహాయం చేయలేని వాడిని. వాళ్లను మీరు తట్టుకోలేరు. గది ఖాళీ చేసి మరో హోటలుకు వెళ్లండి. లేదా మీకు తెలిసినవాళ్లింటికి వెళ్లండి." అని గోడ గడియారం వంక చూసి, "కొద్దిసేపట్లో కోణార్క్ బయల్దేరుతుంది. అది ఎక్కి తిరిగి మీ ఊరు వెళ్లిపోండి. మీ ఇష్టం..... మిమ్మల్ని మీరు రక్షించుకోండి..... ఇంకో సంగతి. నేనీ సలహా ఇచ్చినట్లు దయచేసి ఎవరికీ చెప్పకండి" అన్నాడు. అయిదు నిమిషాల్లో గది ఖాళీచేసి అతనికి ఒకటికి రెండుసార్లు కృతజ్ఞతలు చెప్పుకుని బయటకు వచ్చాను. హోటలు బయట ఉన్న రిక్షాలో కూర్చుని "సికింద్రాబాద్ స్టేషన్‌కి పోనీయి" అన్నాను. అక్కడికి స్టేషన్ అట్టే దూరంలో లేదు. నడిచి వెళ్లదల్చుకోలేదు.

స్టేషన్‌లో టికెట్లు ఇచ్చే దగ్గర పెద్ద క్యూ ఉంది. పోలీసులు ఉన్నారు. క్యూ కదలటంలేదు. ప్లాట్‌ఫాం మీద కోణార్క్ నిలబడి ఉంది. చేతి గడియారం వంక చూసుకున్నాను. బండి బయల్దేరడానికి అట్టే సమయం లేదు. క్యూలో నావంతు వచ్చే లోపల బండి వెళ్లిపోతుంది. ఈ ఊరు తక్షణం వదలి వెళ్లిపోవటం నాకు ముఖ్యం. ఏదిఏమయితే అయిందని ప్లాట్‌ఫాం మీదకు వచ్చాను. గార్డు ఈల ఊదుతూ పచ్చ జండా చూపిస్తున్నాడు. ఇంజను కూతవేసింది. అన్‌రిజర్వ్‌డ్ కంపార్టుమెంట్‌వైపు పరుగెత్తి ముందు కిటికీలోంచి సూటుకేసు బతిమిలాడి లోపలపెట్టి క్రిక్కిరిసిన కంపార్టుమెంట్‌లోకి అతికష్టంమీద జొరపడ్డాను. బండి కదిలింది. బండి ప్లాట్‌ఫాం దాటాక నా మనసు తేలికయింది. మెల్లగా చోటుచేసుకుంటూ కంపార్టుమెంట్‌లోపలికి నడిచాను. తలుపు దగ్గరున్నంత రద్దీ లోపల లేదు. సూటుకేస్ అందుకుని పైనపెట్టి రుమాలు తీసి ముఖానికి పట్టిన చెమట తుడుచుకున్నాను. గుండె దడ తగ్గుతోంది.

కిటికీలోంచి చల్లటి గాలి వీస్తుంటే బండి వేగం అందుకుంది. రుమాలు జేబులో పెట్టుకుని కిటికీలోంచి బయటకు చూశాను. మా అమ్మాయికి నగలు కొందామని, భాగ్యనగరం చూద్దామని వచ్చి ఏమి చేయకుండా తిరిగి వెళ్లిపోతున్నాను. చటుక్కున నా దృష్టి తలుపు బయట ఇనప కమ్మీని పట్టుకుని వేళ్లాడుతున్న వ్యక్తుల మీద పడింది. నాకు ముందుగా కనబడింది స్ఫోటకం మచ్చల ముఖం. వాడి పక్కనే రాములు ఉన్నాడు.

◆ ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక–31 మార్చి 1983